# డూప్

కనకం మేకప్ రూం అనబడే పాత సామానుల కొట్టు లాంటి ఆ చిన్న చీకటి ఇరుకు గదిలో ఒక పాత కుర్చీ మీద భయం భయంగా కూర్చున్నది. ఆ గది అంతా రకరకాల రంగుల వాసనలతో వుక్కతో మాగుడు కంపు కొట్టుతుంది. ఆ వాసనకు కనకంకు కడుపులో వూరికే దేవినట్లుగా వుంది. తను ఆ గదిలో ఆ కంపులో అరగంటకు పైగా మ్రగ్గిపోతున్నా తన అతీగతీ కనుక్కున్న వాళ్ళెవరూ కనిపించలేదు.

నల్లగా బొద్దుగా చిన్న చింతమొద్దు లాగా వున్న ఒక పొట్టి యువకుడు మాత్రం గది గుమ్మంలో నిలబడి ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు మాటిమాటికీ బయటికి తొంగి చూస్తున్నాడు. మధ్య మధ్య తనవంక దొంగ చూపులు చూస్తునాడు. ఆ గదిలో వున్న వాసన చాలదన్నట్లు వెధవ బీడీలు ఒకదాని వెంట ఒకటి వూరికే తాగిపారేస్తున్నాడు.

అతను ఆ స్టూడియోలో 'సి' క్లాస్ మేకప్‌మెన్; కనకం కూర్చున్నది 'సి' క్లాస్ మేకప్‌రూం.

ఆలశ్యం అవుతున్నకొద్దీ కనకానికి భయం ఎక్కువవుతుంది. తనను అక్కడకు తీసికొచ్చిన సూర్యం, "నీవాగదిలో కూర్చోమ్మా, నేనిప్పుడే వస్తాను'' అని చెప్పి వెళ్ళినవాడు ఇంతవరకూ అంతులేడు. తను అక్కడ అలా ఎంతసేపు కూర్చోవాలో, అసలు చేయాల్సిన పనేమిటో కనకానికి అంతు పట్టటం లేదు. ఎవర్ని అడగాలో ఏమిటో. అంతా కొత్తగా భయం భయంగా వుంది. ఎదురుగా కనిపిస్తున్న అవతారాన్ని అడిగితే ఏమంటాడో ఏమో.

కనకం ఎలాగో ధైర్యం చేసి మెల్లగా, "ఏమండి - నేనిక్కడ ఇంకా ఎంతసేపు వుండాలి?'' అని అడిగింది.

"వుండవమ్మా, తొందరపడతావేం? అసిస్టెంట్ డైరక్టర్ గారు రావాలి. ఏ మేకప్ చేయమంటాడో ఏంటో?" అని కసురుకున్నాడు.

కనకం ఆ కసురుడుకు అదిరిపోయి ఎందుకడిగానురా భగవంతుడా అని అనుకుంది.

ఇంతలో బయట కారాగిన శబ్దం వినిపించింది ఎవరో చాలా మంది మనుషులు మాట్లాడుతున్నట్లు మాటలూ నవ్వులూ వినిపించాయి. ఎవరో పెద్దవాళ్ళు వచ్చినట్లుగా బయటంతా హడావుడిగా వుంది అతడు కాలుస్తున్న బీడీని మూలపారేసి కంగారుగా బయటికెళ్ళాడు.

మళ్ళీ అంతలోనే లోపలికి వచ్చాడు. ప్రక్కన బక్కపలచగా ఎత్తుగా వున్న ఇంకో యువకుడు వున్నాడు. అతనికి ఒకచంకలో ఫైలు, మరో చంకలో మడిచి పెట్టిన చీరా వుంది.

చంకలోని చీరను టేబిలు మీద పడేసి, "ఇదిగో ఈ చీరా ఇందులో వున్న బ్లౌజూ కట్టుకో అమ్మాయి!'' అని కనకం వంక పరీక్షగా చూశాడు. "అదేంటి జడ అలా బిగుతుగా వేసుకున్నావు? తల నున్నగా దువ్వుకున్నావు. నోనో - జుట్టంత చిందర వందరగా వుండాలి. శీనూ చూడవోయ్'' అని ఎంత హడావుడిగా వచ్చాడో అంత హడావుడిగా వెళ్ళిపోయాడు. ఈ శీను చెప్పిన అసిస్టెంట్ డైరక్టర్ గారు ఈయనే కాబోలు అనుకుంది. అతగాడి కంగారు ఈ శీనుని పూనిందేమో, తెగ కంగారు పడిపోతూ, "కానివ్వమ్మా, అవతల బేబమ్మగారొచ్చేశారు. ముందా చీర కట్టుకో. ఆ జడవిప్పి లూజుగా వేస్కో -'' అని అంటూ కనకాన్ని కూడా కంగారు పెట్టేశాడు.

మరో పది నిమిషాల్లో ఎక్స్‌ట్రాస్ సప్లయర్ సూర్యం కూడా వచ్చాడు. కనకాన్ని చూచి "ఏంమ్మా, నీవు రెడీయేనా? అయితే కాస్త అలా బయటికి రా, టిఫిన్ అదీ చేద్దువుగాని', అని అన్నాడు.

కనకం అతని వెనకాలే బయటికి వచ్చింది. అతనితో నడుస్తూ, "ఇంకా చాల ఆలశ్యం వుంటుందాండీ'' అంది.

"అబ్బే, ఎంతో ఆలశ్యం వుండదమ్మా! అంతా ఒక్క గంటలో పూర్తయిపోతుంది'' అన్నాడు.

"ఏం కాదూ, యింటికెళ్లటానికి మళ్ళీ సిటీ బస్సులు వుండవేమోనని-'' కనకం నసిగింది.

"అబ్బే, అంతదాకానా? నిన్ను తొమ్మిది గంటలకల్లా పంపించేస్తాగా? అదిగో ఆ బెంచీ మీద కోర్చోమ్మా. నీకు టిఫిన్ పంపిస్తాను.'' అని స్టూడియో కాంటిన్ వయిపు వెళ్ళాడు.

కనకం, స్టూడియో ఆవరణలో వున్న మెర్క్యురీ దీపాల కాంతిలో ఈ చివర్నుంచి ఆ చివర వరకూ మిలమిలా మెరిసిపోతున్న ఒక పెద్ద కారు ముందు నుంచి, ఎదురుగా పార్కులాగా వున్న చోటు కెళ్ళింది.

బహుశా ఈ కారు ఆ బేబమ్మ గారిది అయి వుంటుందనుకుంది. ఆ కారు ముందు నలుగు రయిదుగురు మొగవాళ్ళు నిలబడి సిగరెట్లు త్రాగుతూ మాట్లాడుకుంటున్నారు. వాళ్లు ముందు నుంచి మెల్లగా అణకువగా తలవంచుకుని వెళ్ళుతున్న కనకాన్ని చూచి బిగ్గరగా సాగుతున్న వారి మాటలు ఆగిపోయాయి. లేదూ స్థాయి తగ్గాయి - ఎందుకంటే వాళ్లు మామూలుగా ఆ ఆవరణలో ఠీవి నడకలు, టెక్కు నడకలు, ఖరీదు నడకలు. చూస్తూ వుంటారు. కనకానిది 'జంటిల్'గా వున్న కొత్త నడక అవటం వల్ల కావచ్చు.

కనకం బెరుగ్గా పమిటను భుజాల నిండుగా కప్పుకుంది.

కనకం వాళ్ళను దాటిపోతుండగా వాళ్ళలో ఒకతను 'బేబమ్మకు డూప్-' అని అన్నాడు.

కనకం అక్కడున్న ఒకసిమెంటు బెంచీ మీద కూర్చుంది. అది షూటింగ్ ఫ్లోర్ వున్న సెంటర్లో వున్న ఒక చిన్న పార్కు లాంటిది. మామూలుగా ఎక్స్‌ట్రాలందరూ టిఫిన్లు చెయ్యడం, విశ్రాంతి తీసుకోవడం అందులోనే. అందులో ఒక పంపు కూడా వుంది. చుట్టూ వున్న చెట్లమీదుగా వచ్చే చల్లని గాలి వంటికి తాకగానే అంతదాకా ఆ వుక్కలో ఆ చీకటి కంపు గదిలో వున్న కనకంకు ప్రాణం హాయిగా అనిపించింది.

ఆ స్టూడియోను వూరికి బయటగా వున్న ఒక పెద్ద తోట మధ్యలో కట్టారు. అక్కడ ఎంతో నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుంటుంది. చుట్టూ ఎటు చూచినా నిటారుగా నిలబడ్డ చెట్లు, ఆ చెట్ల

కొమ్మలమీద వాలిన చీకటి, నల్లని ఆకాశంలో అక్కడక్కడ పొదిగిన నక్షత్రాలు - ఆ ప్రశాంత వాతావరణంలో వుండి వుండి వీచే చల్లని గాలి తెరల్లో కనకం తనువు, మనస్సూ మెల్లమెల్లగా సేద తీరుతున్నాయి.

ఆమె కూర్చున్న సిమెంటు బెంచీ ఎదురుగా ఒక ఫౌంటెన్ వుంది. ఆ ఫౌంటెన్ మధ్యలో చంటిపిల్లాడ్ని చకంలో ఎత్తుకుని నిలబడి వున్న ఒక తల్లి పాలరాతి బొమ్మ వుంది. ఆ చంటి పిల్లాడు ఒక చేయి పైకెత్తి బోసినవ్వుతో చూడముచ్చటగా వున్నాడు.

ఇంతలో ఒక కుర్రవాడు రెండు టిఫిన్ పొట్లాలు తీసికొని వచ్చి ఇచ్చాడు. ఆ పొట్లంకు కట్టిన దారం విప్పుతుండగా కనకం అప్పటిదాకా మర్చిపోయిన ఆకలి, ప్రేగుల మడతల్లో ముడుచుకు పడుకున్న ఆకలి కదలటం మొదలయింది. కడుపు నిండా తిండి తిని వారం రోజులయింది. ఈ వారం రోజులుగా ప్రక్కింటి సీతమ్మత్త ఏదో ఒక పూట ఇంత తీసికొచ్చి పెట్టింది. అదీ తన కోడలు చూస్తుందేమోననే భయంతో పమిట చెంగు కింద పెట్టుకుని దొంగచాటుగా తెచ్చేది. పాపం, ఆమె ఇలా ఎంతకాలమని పెట్టుతుంది. ఈ రోజు తనే యింత వుడకేసుకుందామనుకున్నది. కాని, ఇంట్లో బియ్యపు గింజలు లేవు, డబ్బా అడుగున తుడిస్తే గుప్పెడి గింజలున్నాయి. వాటితో ఇంత జావ కాచుకుని తాగి ముసగతీసుకొని పడుకుంది - ఇక ముందు గడిచేది ఎలాగురా భగవంతుడా అని అనుకుంటూ. ఆ భగవంతుడు సీతమ్మత్త తమ్ముడు సూర్యం రూపంలో మధ్యాహ్నం తనకు సాక్షాత్కరించాడు. సూర్యం సినిమా స్టూడియోలకు ఎక్స్ట్రాలను సప్లయి చేస్తూ వుంటాడు.

"ఒకరోజు సినిమాలో వేషం వేస్తే 30 రూపాయలు ఇస్తారంట. ఆ వేషమేదో నీవు వేయకూడదా కనకం!" అని అంది సీతమ్మత్త.

తనేమిటి సినిమాలో వేయం వెయ్యటమేమిటని సందేహిస్తూ వుంటే "నీవేమీ సందేహించవల్సింది, భయపడవల్సిందీ ఏం లేదమ్మా? నేను దగ్గరే వుంటాను. నీకు డైలాగ్స్ ఏమీ వుండవు. ఒక పెద్ద హీరోయిన్ గారికి నిన్ను డూప్‌గా పెట్టుతారు. వడ్డూ పొడుగులో నీవు ఆమెకు లాగే వున్నావు - అందుకని! అంతా ఒక్క గంటసేపట్లో అయిపోతుంది. రాత్రి తొమ్మిది గంటలకల్లా యింటికి తిరిగి వచ్చేయవచ్చు -" అని సూర్యం అన్నాడు.

"ఇంకా సందేహిస్తావేంటి, వప్పుకో అమ్మాయి! నీవు కాదంటే మరింకెవరికన్నా యిచ్చేస్తారు. తేలిగ్గా వచ్చే ముప్పై రూపాయలు అనవసరంగా పోతాయి. ఎవరో అమ్మాయి కోసం పోతున్నాను అని వాడంటే, నీ సంగతి చెప్పి ఎవరోదాక ఎందుకు ఆ వేషమేదో నీకిప్పించమని చెప్పి వాడ్ని వప్పించాను" అని సీతమ్మత్త బలవంతం చేసింది.

"ఆ అమ్మాయి వెనకాడుతుంటే నీకేంటి మధ్యలో - నాకు మనుషులు దొరక్క కాదమ్మాయ్! అప్ప చెప్పిందని గాని-" అని అతడు వెళ్ళి పోవడానికి తయారవుతుంటే, చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితిలో తేలిగ్గా రాబోయే ముప్పై రూపాయలు పోతాయేమోనని, తను సరేనని వప్పుకుంది.

తనకిన్ని రకాలుగా సాయం చేస్తున్న సీతమ్మత్త తన పాలిట దేవతే అని అనుకుంది మనస్సులో

.... కనకం మెల్లగా టిఫిన్ తింటుండగా సూర్యం ఇంకో టిఫిన్ పొట్లం, కాఫీ పట్టించుకొచ్చాడు.

"ఇది కూడ తినమ్మా! తిని కాఫీ త్రాగు - అంతా రెడీ అయిపోతుంది. షూటింగ్ మొదలుపెట్టేయబోతున్నారు" అని మళ్ళీ ఎటో వెళ్ళాడు యిప్పుడే వస్తానని.

నిజంగా సూర్యం ఎంత మంచివాడు అనుకుంది.

కడుపులో నిండుగా ఫలహారం, కాఫీ నీళ్ళు పడేసరికి తేలిగ్గ హాయిగా వుంది.

మరో అయిదు నిమిషాల్లో సూర్యం హడావుడిగా వచ్చి కనకాన్ని వెంటపెట్టుకొని ఒక పెద్ద ఫ్లోరులోకి తీసికెళ్ళారు, లోపల ఎవరెవరో చాలామంది మనుషులున్నారు, కళ్ళు మిరుమిట్లు కొల్పే లైట్లు వున్నాయి. ఒక పెద్ద హాలు సెట్ వేసి వుంది. ఆ హాలులో ఒకవైపు నుంచి మేడమెట్లున్నాయి. కింద సోఫాలు తివాచీలు వున్నాయి.

కనకంకు ఆ లైట్లను, మనుషులు చూచేసరికి భయం వేసింది. భయంతో ముడుచుకుపోయి ఒక పక్కగా నిలబడింది.

ఇంతలో 'బేబమ్మ' అనే ముద్దు పేరుతో పిలవబడే ఆ సినిమాలోని హీరోయిన్‌గా ఫుల్ మేకప్‌లో సెట్‌లోకి వచ్చింది. ఆమెతోపాటు ఆమె అంగరక్షకులు వచ్చారు. ఆమె లోపలికి అడుగు పెట్టగానే కొన్ని క్షణాలు ఒక విధమైన నిశ్శబ్దం అక్కడ ఆవరించింది.

ఆమెను చూచి కనకం ఆశ్చర్యపోయింది. ఆమె, తను కట్టుకున్న లాంటివే చీరా రెవికా కట్టుకుని వుంది. అధాట్న చూస్తే అచ్చం తనలాగే వుంది. మరి ఆమెగారుంటే తన నెందుకు పిలిచినట్లో అని అనుకుంది.

బేబమ్మ పక్కన మఫ్టీలో వున్న (మేకప్ లేకుండా వున్న) ఒక యువతి కూర్చుని ఉంది. ఆ యువతి బేబమ్మ పర్సనల్ అటెండర్, ఆమె ఎప్పుడూ, ఎప్పటికీ పూర్తికాని ఒక వూలు స్వెట్టర్ అల్లుతూ, బేబమ్మతో కబుర్లు చెప్తూ లేక బేబమ్మ కబుర్లు వింటూ వుంటుంది. అందుకుగాను షూటింగ్‌కు వచ్చినప్పుడల్లా ప్రొడ్యూసర్ గారి దగ్గర్నుంచి ఇరవై అయిదు రూపాయలు రోజువారీ బత్తా తీసికుంటూ వుంటుంది.

మరో పది నిముషాల్లో లైటింగ్ మొదలైన ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి! కనకాన్నీ మేడమీదికి రమ్మన్నారు. ఆమె మేడమెట్లు ఎక్కబోతూ సూర్యం వంక భయంగా చూసింది. ఫర్వాలేదన్నట్లుగా సూర్యం సైగచేశాడు.

పైన డైరక్టరు గారు, ఆయన అసిస్టెంట్‌లూ వున్నారు. క్రేన్‌లో కెమేరాను పెట్టుకుని కెమెరామెన్ సిద్ధంగా వున్నాడు.

"చూడమ్మాయి, నేను రెడీ అనగానే నీవు ఈ మెట్లమీద నుంచి క్రింది దొర్లుకుంటూ పడాలి-" అని డైరక్టరు గారన్నారు.

కనకం, "కిందకు దొర్లాలా?" అని ఆశ్చర్యంగా అడిగింది.

అంతకంటే ఆశ్చర్యంగా, "అవును, ఏం?" అనే ప్రశ్న వచ్చింది.

"నాకు అలా దొర్లటమంటే భయమండి?'' అని తలవంచుకుని మెల్లగా అన్నది.

"అయితే నీకిలా దొర్లాలని ముందుగా తెలియదా?''

"తెలియదండి-''

"ఏరా సూర్యంగా'' అని ఒక పెద్ద కేకేసి, "నీవు ఏ పని చేసినా యిలాగే చేస్తావురా వెధవ-'' అని ఒక బూతు తిట్టుకూడ తిట్టారు డైరక్టరుగారు ఆపుకోజాలని కోపంతో.

సూర్యం కంగారుగా మెట్లెక్కి పైకి వచ్చాడు.

"నీవు ముందుగా ఇలా దొర్లాలని ఆ అమ్మాయికి చెప్పలేందంటగా?''

సూర్యం, "ఏం ఫర్లేదమ్మా, కొద్ది మెట్లేగా వున్నాయి. ఆ కింద తివాచి కూడా వుంది. ఊరికే యిక్కడ్నుంచి కిందకల్లా దొర్లేసేయ్. ఇంత ఢబ్బు ఇస్తుంది మరి దీనికేనమ్మా - లేకపోతే మామూలుగా రోజుకయిదే ఇస్తారు'' అన్నాడు.

కనకం ఇంకా సందేహిస్తు వుంటే, "ఇప్పుడు నీవు కాదంటే యిప్పటికప్పుడు కొత్త వాళ్ళెవర్ని తీసికొస్తాం చెప్పు? అంతా రెడీ అయింది. ఒక్కరోజు షూటింగు అంటే మాటలా? రెండువేల రూపాయల ఖర్చు, అంతా వృధా అవుతుంది.'' అని అన్నాడు. అంతకు ముందు రాజకీయాల్లో రాటుదేలి యిప్పుడు సహకార దర్శకుడుగా పనిచేస్తున్న ఒకాయన.

"నీమూలంగా మధ్యలో నాకు మాట వస్తుంది అమ్మాయి!'' అని సూర్యం నిష్ఠూరంగా అన్నాడు. ఈ మాట కనకం మీద బాగా పనిచేసింది. సూర్యాన్ని బట్టి సీతమ్మత్త మాట ఖాళీ అవుతుంది. తనకోసం సీతమ్మత్త మాట పడకూడదు. పయిగా ప్రస్తుత పరిస్థితుల్లో తనకా డబ్బు ఎంతో అవసరం.

"సరే కానివ్వండి-'' అంది కనకం ఆఖరికి తెగింపుగా.

డైరక్టర్‌గారు 'రెడీ' అనగానే కనకం లుంగచుట్టుకుని పై మెట్టుమీంచి నేర్పుగా, ఖాళీ డ్రమ్ లాగా దొర్లుకుంటూ కింద పడింది.

ఆ షాట్ అయిపోయింది. కనకం లేచి నిలబడి, "అమ్మయ్య!'' అని అనుకుంది. తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. చిన్నప్పుడు తోటి పిల్లలతో కలిసి కరణంగారి వాముల దొడ్లో గడ్డివాముల మీదనుంచి కిందకు దొర్లుకుంటూ ఆడుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి.

సేఫ్టీ షాటుకు మళ్ళీ ఇంకోసారి దొర్లాలి అన్నారు. దొర్లడమంటూ ఒకసారి జరిగిన తర్వాత మళ్ళీ ఎన్నిసార్లు దొర్లుతేనేం అని తనలో అనుకుని "సరే కానివ్వండి'' అంది.

ఇంతలో బేబమ్మ అటెండర్ వచ్చి - "బేబమ్మ గారికి వంట్లో బాగోలేదు. తల తిరుగుతుతన్నట్లుగా వుంది.'' అని అక్కడ అనౌన్స్ చేసింది.

ప్రొడ్యూసరూ, డైరక్టరూ, వాళ్ళూ వీళ్లూ బిలబిలా వచ్చి బేబమ్మ చుట్టూ మూగారు.

"అమ్మా డాక్టరుకు ఫోన్ చేయించమంటారా?'' కంగారుపడుతూ అడిగాడు ప్రొడ్యూసరు.

"అవసరం లేదండి బంగళాకెళ్ళి రెస్టు తీసుకుంటాను అదే తగ్గిపోతుంది. ఇవాళ నా షూటింగ్ కాన్సిల్ చేసుకోండి.''

"అలాగేమ్మ! మీ ఆరోగ్యం కంటేనా కారు రెడీ చేయంచమంటారా?'' ఆ వేళ షూటింగ్ ఖర్చు రెండువేల రూపాయలు వృధా అయిపోయాయని లోపల ఏడుస్తున్నా పైకి అలా అనక తప్పలేదు ఆ మానవుడికి, పాపం.

ఆ సినిమా కథలో ఆమె విలన్ని చూచి షాక్ తిని మేడమెట్ల మీదనుంచి జారి కిందపడుతుంది. ఆరోజు ఆమె మెట్లమీద నిలబడి క్రిందకు పడబోయే ముందు భయభ్రాంతురాలవటం మెట్లమీద నుంచి దొర్లిపడటం, నేల మీద పడిన తర్వాత మూలగటం మొదలైన దృశ్యాలను చిత్రీకరించాలి.

ఆమె గారు మేడమెట్లమీదనుంచి కిందకు దొర్లి పడలేదుగా. ఎందుకంటే వున్నత కుటుంబంలో పుట్టి, చిన్నప్పట్నుంచి యింగ్లీషు కాన్వెంటులో చదివి, చిన్నతనంలోనే పేరుగాంచిన నృత్యకారుల వద్ద నృత్యకళను అభ్యసించి, కాలేజీ నాటకాల్లో వేషాలు వేసి, ఇంగ్లీషు, కన్నడం, తమిళం, హిందీ మున్నగు భాషల్లో ధారాళంగా మాటాడగలిగి, తీరిక వేళల్లో వంట చేయుట, ఇంగ్లీషు నవలలు చదువుట, ఇంగ్లీషు సినిమాలు చూచుట, హాబీగా కలిగిన తార, కళకి జీవితాన్ని అంకితం చేసిన తార సిన్మాల్లో నటించగలదు కానీ, మేడల మీదనుంచి కొండలమీద నుంచి దొర్లి పడగలదా? అందుకనే ఆమెకి 'డూప్'గా ఆమెకు బదులు కనకం కిరాయికి, మేడమెట్లమీద నుంచి దొర్లుపుచ్చకాయలాగా కిందకు దొర్లింది.

'సేఫ్టీషాట్'కు కనకం రెండోసారి కూడా ఆ మెట్లమీంచి కిందకు దొర్లింది. టేక్ 'ఒకే' అయింది. రెండోసారి దొర్లుతుండగా కనకానికి నడుం కలుక్కుమంది. షాట్ అయిన తర్వాత మంచినీళ్ళు త్రాగుతుండగా పొత్తికడుపులో సన్ననిపోటు ప్రారంభం అయింది. మేకప్ రూం కెళ్ళి చీర మార్చుకునే లోపల క్రమక్రమంగా ఎక్కువయింది.

సూర్యం వచ్చి, "నా కమీషన్ రూ. 10 లు పోను మిగిలిన ఇరవై రూపాయలు ఇదిగో'' అని ఇచ్చాడు. నిజానికి యిందులో సూర్యం మొత్తం ముప్పై రూపాయలు కొట్టేశాడు. పై నుండి కిందకు దొర్లినందుకు ఏభై రూపాయలు యిస్తారు. మోటు పని కాబట్టి. కాని, కనకానికి ముప్పై రూపాయలే, అని చెప్పి అందులో ఇరవై, మళ్ళీ తన కమీషన్ క్రింద పది మొత్తం ముప్పై రూపాయలు జేబులో వేసుకున్నాడు. ఇంతకీ అన్ని మెట్లమీద నుండి రెండుసార్లు దొర్లినందుకు కనకంకు వచ్చింది ఇరవై రూపాయలే. అదే మామూలుగా చేసే వాళ్ళయితే సూర్యానికి ఐదు రూపాయలు మాత్రమే గిట్టేవి.

కనకం ఆ డబ్బును బొడ్లో దోపుకుని మెల్లగా మేకప్ రూములోంచి బయటకు వచ్చింది. ఆమెకు నడుంలో నలగబొడుస్తున్నట్లుగా వుంది. ఎలాగో వోపిక చేసుకుని మెల్లగా బయలుదేరింది. ఆమె పొత్తికడుపులోని నరాలు వూరికే లాగేస్తున్నాయి. అరికాళ్ళు తిమ్మిర్లెక్కుతున్నాయి.

ఇందాక తను టిఫిన్ తిన్న పార్కును దాటుతూ ఫౌంటెన్ మధ్యవున్న పాలరాతి బొమ్మ వంక చూసింది. తల్లి చంకలోని పిల్లవాడు ఎత్తిన గుప్పిలి ఆ తల్లి మధురస్వప్నాల ఫలాన్ని ఆమెకందిస్తున్నట్లుగా వుంది.

కనకంకు పొత్తికడుపులో కత్తిపోటు పొడిచినట్లనిపించింది. బాధతో, 'అమ్మా! అని కడుపుమీద చేయి వేసుకుంది.

అలా కొద్దిదూరం నడిచేసరికి కనకంకు విపరీతంగా ఆయాసం వచ్చింది. ఇంకో అడుగు కూడా ముందుకేయలేక పోయింది. నడుం మనుగుల్లోని బాధ మరీ ఎక్కువయింది. పొత్తికడుపు కిందికి జారుతున్నట్లుగా వుంది. ఒక చెట్టుకు జారగిలబడి కూర్చుంది. తడిగుడ్డను పిండుతున్నట్లుగా కడుపంతా మెలివేస్తున్నది. ఆ బాధకు తట్టుకోలేక మెలికలు తిరుగుతుంది. కొద్దిసేపు బాధ తగ్గి తగ్గుతూ వుండి వుండి పొత్తికడుపులో పోట్లు వస్తున్నాడు. బిగ్గరగా అరవాలనిపిస్తుంది. కాని అది కానిచోటు అయిపోయింది. అలాగే బిగపట్టుకుంటుంది. సన్నసన్నగా మూల్గుతుంది. ఎవరూ ఆ దరిదాపుల్లో కనిపించటంలేదు. తను కూర్చున్న చెట్టుమీద వున్న గూట్లోని పక్షులు వుండి వుండి అరుస్తున్నాయి. దూరంగా ఏ చెట్టుమీదనుంచో కీచురాయి అరుస్తుంది.

కొన్ని క్షణాల తరువాత లోపల నొప్పి సర్దుకుంటున్నట్లు, బాధ తగ్గినట్లనిపించింది.

ఫౌంటెన్ లోని బొమ్మా, తల్లి చంకలోని పిల్లవాడూ కళ్ళముందు మెదిలారు. ఆ పిల్లవాడు తన బుల్లి గుప్పిళ్ళను పైకెత్తి గాలిలో వూపుతున్నాడు. కిలకిలమని బోసినవ్వుగా నవ్వుతున్నాడు. అప్రయత్నంగా పొత్తికడుపుమీద చేయి వేసుకుని ఆప్యాయంగా నిమురుకుంది.

కనకంకు ఏడ్పు ముంచుకు వచ్చింది. ఆమెకు గుండె ఆగిపోయినంత పనయింది....ఏమిటి? ఏమవుతోంది? ఈ బాధ, కడుపులో ఈ కత్తిపోట్లు, మనుగుల్లో ఈ శూలాలు గుచ్చుకోవటం అందుకేనా? అయ్యో, భగవంతుడా, ఎంతపని చేశావు తండ్రీ? నా బతుకులో నిప్పులు పోశావే? అయ్యో అయ్యో, ఇప్పుడేంటి చేయటం? అందుకేనా ఈ బాధ? ఏమౌతుంది! అయ్యో, ఎవరూ చెప్పరేంటి? బాబూ, నీవయినా చెప్పరా బాబూ - నీవు వెళ్ళిపోతున్నావా? పలకరా తండ్రి! ఎంత పాపిష్ఠిదాన్ని? కోపం వచ్చిందా? ఈ అమ్మమీద నీకు కోపం వచ్చిందా బాబు? నాలోంచి బయటపడాలని చూస్తున్నావా? ఈ అమ్మ మంచిది కాదని ఇంకో అమ్మ దగ్గరకు పోవాలని చూస్తూ వున్నావా? అందుకనేనా బాబు, లోపల అంతగా గింజుకుంటున్నావు? నిన్ను నాలో బంధించిన తల్లి ప్రేమను తెంచుకొని బయటపడాలనే కదా బాబు! నీ అమ్మ కడుపులో ఇలా కత్తిపోట్లు పొడుస్తున్నావు? ఈ మూడు నెలలలో ఈ అమ్మ అంటే నీకు మొగం మొత్తిందా బాబు?

వుండి వుండి ఆ చెట్టుమీద తలదాచుకున్న పక్షులన్నీ కనకం దీనావస్థకు విలపిస్తున్నట్లుగా గోలగోలగా అరిచాయి. కబోది పక్షులు రెక్కల్ని భయంకరంగా టపటపలాడించాయి.

కనకంకు మళ్ళీ బొడ్డు కింద, పొత్తికడుపు మడతల్లో నొప్పి మొదలయింది. తెరలు తెరలుగా వస్తుంది. బాధతో గిలగిలలాడిపోతుంది. వూరికే మెలికలు తిరిగిపోతుంది. రెండు చేతులు పొట్టమీదేసుకుని అదుముకుంటుంది. మూగగా తనలో తాను విలపిస్తుంది... తన చుట్టూ వున్న చెట్లల్లోంచి జడల దెయ్యాలు వికటాట్టహాసం చేస్తూ తనమీద మీదకు వస్తున్నట్లనిపించింది. ఫౌంటెన్ లోని పిల్లాడ్ని ఎత్తుకున్న తల్లీ తనను చూచి వెక్కిరిస్తుంది. ఎవరో పసిపిల్లాడి ఏడ్పు తన చెవుల్లో సన్నగా వినిపిస్తుంది. మూడు నెలల క్రితం తను తల్లికాబోతుందన్న విషయం మొదటిసారిగా విన్నప్పుడు తన భర్త మురిసిపోవటం, అతని గుండెల్లో సిగ్గుతో తను తల దాచుకోవటం, మనకు బాబే పుడతాడు కనకం అని

అతను తన వీపు నిమురుతూ చెప్పడం సరిగ్గా పది రోజుల క్రితం ఉదయం, టిఫిన్ కారియర్‌లో అన్నం పెట్టుకుని నవ్వుతూ ఫ్యాక్టరీ కెళ్ళిన భర్త సాయంత్రం యింటికి తిరిగి వస్తూ దారిలో లారీ కిందపడి రక్తము ముద్దగా యింటికి తిరిగి రావటం ఇరుగు పొరుగు జనం పోగవటం, అతను తుది క్షణాల్లో, "కనకం నిన్ను దిక్కులేనిదాన్ని చేసిపోతున్నాను, నీవెన్ని కష్టాలు పడ్డా నీవు మన బాబును పెంచి పెద్దవాడ్ని చేయాలి. గొప్పవాడ్ని చేయాలి. ఈ వంశాన్ని నిలిపేవాడు వాడే'' అని కళ్ళు మూయడం, తన యింటి దీపం ఆరిపోవడం, తన తల గోడకేసుకుని బాదుకుని బాదుకుని ఏడవటం, సీతమ్మత్త వాళ్ళు వోదార్చడం...... అన్నీ ఒకదాని తర్వాత ఒకటి కనకం కళ్ళముందు మెదిలాయి.

రెండు చేతులతో తలపట్టుకుని కనకం కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది. 'అయ్యో మీకిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయానండి! పాపిష్టిదాన్ని, మీ ఆఖరి కోర్కె చెల్లించాలనేనండి నేనీ పనికీ వప్పుకుంది. ఇలా సిన్మాలో వేసి రోజుకు ముప్ఫై రూపాయలు సంపాదించి పుట్టబోయే మన బాబు కోసం కూడబెట్టాలనుకున్నాను! మన బాబు బంగారు భవిష్యత్తుకు మూట కట్టాలనుకున్నాను గానీ, యింత ఘోరం జరుగుతుందనుకోలేదు. లేత నెలల్లోనే ఇలా ముంచుకొస్తుందని అనుకోలేదు. అయ్యో! ఇప్పుడేమిటి గతి? అయ్యో మన వంశం నిర్వంశమయిపోయినట్లేనా నన్ను మీరు క్షమిస్తారా? చెప్పండి - ఏమి ఆధరువు లేకుండా నన్ను దిక్కులేని పరిస్థితుల్లో వదిలేసి మీదార్ని మీరు పోయారు - నామీద జాలి తలచి సీతమ్మత్త ఈ దారి చూపిస్తే సరే అన్నాను కాని, ఈదారే నన్నిలా అగాధంలోకి పడేస్తుందని అనుకోలేదు - అయ్యో, అమ్మో, బాధ - బాధ.

కనకం "అమ్మా'' అని మూలిగింది.

సరిగ్గా అదే సమయంలో బేబమ్మ తన బంగళాలో ఏ.సి. వేసిన తన పెద్ద పడగ్గదిలో పెద్ద పడవలాంటి తన పడక మంచం మీద కూర్చుని వుంది. ఆమె చేతిలో రెండు మాత్రలున్నాయి. మరో చేతిలో మంచినీళ్ళ గ్లాసుంది. గాజుగ్లాసులోని మంచినీళ్ళ వంక కొన్ని క్షణాలు తీక్షణంగా చూచి, ఎదురుగా నిలబడ్డ తల్లిని చూచి "ఏవీ ప్రమాదం లేదు కదా?'' అంది దిగులుగా.

బేబమ్మ అమ్మ, "పెమాదం? నాను ఒకటికి రెండుమాట్లు ఆ డాకటేరు బాబును గట్టిగా అడిగా. అట్టాంటి భయమేం లేదన్నాడు. తెల్లారేపాటికి అంతా సల్లంగా సక్కనయి పోతుందన్నాడు-' అని మహా గట్టిగా హామీ యిచ్చింది.

సిన్మాతారకు పిల్లలు అవరోధం - అందులోనూ 'కుమారి'గా భరించలేని అవమానం!

-- మాత్రలు నోట్లో వేసుకొని గడగడా నీళ్ల తాగేసింది.

- 'స్వాతి' మాసపత్రిక జనవరి **1971** మరల అక్టోబరు **1976**

★